# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

## - శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :** ఎంతో ప్రాధాన్యత ఉన్న విద్యారంగంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ వెంకటయ్య హాజరయ్యారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. జ్ఞాపకాలను అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్





మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ నినాదాన్ని, ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్ళింది టీచర్లని గుర్తు చేశారు. తెలంగాణ జీవన ప్రయాణానికి దిశానిర్దేశం చేయడమే కాకుండా గురువులు సమాజ నిర్మాణానికి శిల్పులుగా నిలిచారని అన్నారు. ప్రేరణాత్మక సేవా దృక్పథం ప్రజల పట్ల వారు చూపుతున్న కృత నిశ్చయాన్ని, త్యాగాన్నీ ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి అయిన కార్పొరేటర్ ఉపాధ్యాయుల పట్ల తన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన చదువుతో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు, మాజీ కౌన్సిలర్లు సోమదాస్, వీరేశం గౌడ్, కె. రాంచందర్, ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి, పిఆర్ టి యు రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు శ్యామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బలవంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తాజ్ బాబు బసవలింగం, వసుంధర, శైలజ, పిఆర్ టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు, రవీందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాల్రెడ్డి, కర్ణ, పీ.ఈ.టీ కేశవరెడ్డి, వీరేశం, ఎంపీపీఎస్ గోపినగర్ హెచ్ఎం శివరాజ్, ఎంపీపీఎస్ సురభి కాలనీ హెచ్ఎం పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డు మెంబర్ కవిత, రాజ్ కుమార్, సుధాకర్ రెడ్డి, మహేష్ చారీ తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ ఐటిఐలో కొత్త కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ



**మేడ్చల్, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :**మేడ్చల్ ప్రభుత్వ ఐటిఐ లో కొత్త కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హనుమా నాయక్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఆధారంగా ఫ్రూట్స్, వెజిటబుల్ ప్రాసెసింగ్ లో 40 సీట్లు, సీయింగ్ టెక్నాలజీ లో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇవి ప్రధానంగా మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతను దృష్టిలో పెట్టుకొని ఈ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు. ఇందులో బాలికలు, మహిళలు, పురుషులు, ముఖ్యంగా 10వ తరగతి పాసై,14 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. అదే విధంగా ఇతర ట్రేడ్లలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 30 తేదీ లోపు సంప్రదించవచ్చునన్నారు. ఇతర వివరాలకు 90307 22464, 93 9151 5500 నెంబర్లలో సంప్రదించవచ్చు.

# మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన టీఎస్ జెయు నేతలు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :** భూపాలపల్లి పట్టణంలోని సెగ్గంపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సమ్మక్క ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా, మృతురాలు కుటుంబాన్ని శుక్రవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎస్ యుజెఐ) నేతలు పరామర్శించారు. మృతురాలు కుమారుడు, జర్నలిస్టు ఆకుదారి సత్యనారాయణను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జెయు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పావుశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కడపాక రవి, జిల్లా సంయుక్త కార్యదర్శి మారపెల్లి చంద్రమౌళి, క్యాతం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి

## - మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :** మహిళా అభ్యున్నతి కోసం, వారి సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో నల్ల మల్లీస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం దిగ్విజయంగా నడుస్తుందని అన్నారు. ప్రధానంగా 11 ఏళ్ల పాటు నూతన రేషన్ కార్డు లు లేక ఎదురుచూసిన లక్షలాది మందికి కాంగ్రెస్ ప్రభుత్వం నూతన తెల్ల రేషన్ కార్డులను అందించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పేద ప్రజల నివాసానికి ఇందిరమ్మ ఇండ్లు, పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం, పేద ప్రజలు వాడుకుంటున్న 200 యూనిట్ల లోపు విద్యుత్తు బిల్లుల మాఫీ, సెల్ఫ్ హెల్ప్ మహిళా గ్రూపులకు వడ్డీ లేని 21 వేల కోట్ల నిధుల మంజూరి, మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ తదితర కార్యక్రమాలతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి విశేష కృషి సలుపుతుందని అన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ మహిళలకు, పేద వర్గాల వారికి కాంగ్రెస్ పార్టీ విశేష ప్రాధాన్యతనిస్తూ, వారి సంక్షేమానికి పాటుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలకు నల్లమల్లి ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో మహిళలకు



బతుకమ్మ చీరల పంపిణీ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రాజీవ్ గృహకల్ప వాసులు, పెద్ద సంఖ్యలో మహిళలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నల్లమల్లి ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్పర్సన్ సామ్రాజ్యలక్ష్మి, కే సరిత, శ్రీదేవి, అరుణ, రాధిక, అనంతలక్ష్మి, స్రవంతి, శశికళ, పల్లా శశికళ, విజయశ్రీ, అనిత, పద్మ, సరిత, వీణ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# రాయల్ ఫోటో స్టూడియో అధినేత గౌసోద్దీన్ కు ఘనంగా సన్మానం




ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కీసర మండలం భోగారంలో ఫోకస్ ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల్ ఫోటో స్టూడియో అధినేత మహ్మద్ గౌసోద్దీన్ ను అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

(కీసర, తెలంగాణ దిశ)

# 22 నుంచి శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :**ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్, టీఎస్ఐఐసీ కాలనీలోనిశ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా 22వ తేదీన మహా గణపతి పూజ, స్వస్తి వాచనం, అంకురరోపనం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 22 సోమవారం అమ్మవారికి అభిషేకం, చతుః శిష్ట ప్రచార పూజ, లలిత సహస్ర నామ కుంకుమార్చన, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29న మూలా నక్షత్రం సందర్భంగా చండీ హెూమం, సరస్వతీ పూజ నిర్వహిస్తామని తెలిపారు. 30వ తేదీ మంగళవారం ప్రత్యేకంగా గాజుల అర్చన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ రెండవ తేదీ గురువారం విజయదశమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు, కలశ ఉద్వాసన పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 22న అమ్మవారిని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారం, 23న శ్రీ రాజరాజేశ్వరి




దేవి అలంకారం, 24న పార్వతీదేవి అలంకారం, 25న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం, 26న సంతాన లక్ష్మీదేవి అలంకారం, 27న శ్రీ గాయత్రీ దేవి అలంకారం, 28న శ్రీ మహాలక్ష్మి అలంకారం, 29న శ్రీ సరస్వతీ దేవి అలంకారం, 30న శ్రీ దుర్గాదేవి అలంకారం, అక్టోబర్ 1న శ్రీ మహిషాసుర మర్ధిని దేవి అలంకారం, రెండవ తేదీన శ్రీ లలితా పరమేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# తెలంగాణలో జూడోకు ఎంతో ఆదరణ

## - క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా నేషనల్ జూడో చాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :**తెలంగాణ క్రీడా శాఖ అందిస్తున్న ప్రోత్సాహక విధానాలతో అనేక జాతీయ అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడానికి అనేక జాతీయ ఫెడరేషన్లు ముందుకు వస్తున్నాయని తెలంగాణ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నవంబరు 3తేదీ నుండి 7తేదీ వరకు కే వి ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించబోయే సబ్ జూనియర్ నేషనల్ జూడో చాంపియన్ షిప్ ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్ 2025 పోస్టర్ ను రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా ప్రోత్సాహక విధానాలతో అనేక జాతీయ క్రీడా ఫెడరేషన్లు పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించడానికి హైదరాబాద్ ను వేదికగా నిర్ణయించుకుంటున్నారని అన్నారు. ఒలంపిక్



క్రీడా ఆయన జూడో కు తెలంగాణలో ఎంతో ఆదరణ ఉందని జూడో పోటీలు నిర్వహించడం వల్ల ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, తెలంగాణ జూడో అసోసియేషన్ చైర్మన్, తెలంగాణ సహకార ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జూడో అసోసియేషన్ అధ్యక్షులు బి. కైలాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు జి. రమాదేవి, జి. రామ్ లక్ష్మణ్, కోశాధికారి రవీందర్, టెక్నికల్ కమిటీ చైర్మన్ సిహెచ్. రాము, సభ్యులు నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన బాచుపల్లి పోలీసులకు సన్మానం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనాల సందర్భాలలో సమయస్ఫూర్తిగా వ్యవహరించి, ప్రశాంతంగా నిమజ్జనల కార్యక్రమాలు జరిగేటట్లు చూసిన బాచుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సతీష్ కు శుక్రవారం గణేష్ ఉత్సవ సమితి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సిఐ సతీష్ కు, ఇతర సిబ్బందిని శాలువాలతో సన్మానించిన ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి రెండవ డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, దాసి నాగరాజు, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిజాంపేట కన్వీనర్ రచ్చ చక్రధర్, కార్పొరేషన్ ఉత్సవ సమితి నాయకులు అశోక్, బాబు చౌదరి, కొండం నాయుడు, సత్య, ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# వరద ముంపు నివారణ చర్యలు తీసుకోవాలి

## - రోడ్డుపై నీటి గుంట వద్ద నిరసన వ్యక్తం చేసిన కాలనీ వాసులు

**చర్లపల్లి, సెప్టెంబర్ 19, (తెలంగాణ దిశ) :**కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వరద నీరు ముంచెత్తింది. దీంతో రోడ్లు చిన్న భిన్నమయ్యాయి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని నీటిని తొలగించడంతో పాటు రోడ్లను మరమ్మత్తు చేయాలని ఆయా కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోనిసాయినగర్, కృష్ణారెడ్డి నగర్, బంజారా కాలనీ, నాగార్జున నగర్ ఫేస్ 1, శివ సాయి నగర్, మీనాక్షి నగర్, లక్ష్మీనరసింహ కాలనీ, సోనియా గాంధీ నగర్ ఫేస్ 2, మధురా నగర్ తదితర కాలనీలలో వరద మురుగు నీళ్ల ముంపు, ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తాచెదారం, సీసం పెంకులు, మట్టి రాళ్లు ఇసుకమేటలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ముంపు కాలనీలు, బస్తీలలో



సహాయక చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చర్లపల్లి కాలనీలా సమాఖ్య ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడిన నీటి గుంటి వద్ద నిరసన తెలిపారు. సిసిఎస్ అధ్యక్షుడు ఏంపల్లి పద్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

# ఓటీటీ స్ట్రీమింగ్ కు సిద్ధమైన రజనీకాంత్ 'కూలీ'



సూపర్‌స్టార్ రజనీకాంత్, సంచలన దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఆగస్టు 14న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం, ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. సెప్టెంబర్ 11 నుంచి ఈ సినిమా అందుబాటులో ఉంటుందని అమెజాన్ ప్రైమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. థియేటర్లలో రజనీకాంత్ నటన, లోకేశ్ దర్శకత్వ ప్రతిభ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా, ఈ చిత్రంలో టాలీవుడ్ కింగ్ నాగార్జున పోషించిన సైమన్ పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. విశాఖపట్నం పోర్టు నేపథ్యంలో సాగే ఈ కథలో, అక్రమ సామ్రాజ్యాన్ని నడిపే డాన్‌గా నాగార్జున, అతడిని ఎదిరించే సామాన్యుడిగా రజనీకాంత్ మధ్య నడిచే సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. తన స్నేహితుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్న దేవా (రజనీకాంత్) అనే వ్యక్తి, పోర్టును తన ఆధీనంలో ఉంచుకున్న సైమన్ (నాగార్జున) అక్రమాలను ఎలా ఎదుర్కొన్నాడు అనేదే ఈ చిత్ర కథాంశం. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్, ఉపేంద్ర, రచిత రామ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు, మరోసారి చూడాలనుకునే వారు సెప్టెంబర్ 11 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో వీక్షించవచ్చు.

# ఓజీలో పవన్ కళ్యాణ్ డబుల్ రోల్‌లో కనిపించనున్నాడా..!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఓజీ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. యువ దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌లో పవన్ కళ్యాణ్ డబుల్ రోల్ లో కనిపించనున్నాడని టాలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇది నిజమే అయితే, పవన్ కెరీర్‌లో ఇది తొలిసారి డబుల్ రోల్ కావడం విశేషం. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్ రెండు పాత్రలు పోషించిన సినిమా ఏదీ రాలేదు. అయితే ఓజీ ద్వారా అభిమానులకు మామూలు సర్‌ప్రైజ్ ఇవ్వడం లేదని అర్థమవుతుంది. ఇండస్ట్రీ నుండి వినిపిస్తున్న సమాచారం ప్రకారం, పవన్ పోషిస్తున్న రెండు పాత్రలు కూడా చాలా పవర్‌ఫుల్ గా ఉంటాయని తెలుస్తోంది. అందులో ఒకటి ఓజస్ అనే గంభీరమైన గ్యాంగ్‌స్టర్ క్యారెక్టర్ కాగా, మరొకటి ఓ ఎమోషనల్ ఉ షాకింగ్ ట్విస్ట్‌తో కూడిన పాత్ర అని టాక్. ఈ విషయాలు బయటకు రావడంతో, పవన్ ఫ్యాన్స్‌లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక మోహన్, శ్రియా రెడ్డి వంటి బిగ్ కాస్ట్ నటిస్తుండగా, సంగీతాన్ని ఎస్.ఎస్. థమన్, సినిమాటోగ్రఫీని రవి కె. చంద్రన్ అందిస్తున్నారు. విజువల్స్, మ్యూజిక్ పరంగా కూడా ఓజీ గ్రాండ్‌గా ఉండబోతుందని సమాచారం.పవన్ రాజకీయంగా బిజీగా ఉండటం వల్ల షూటింగ్ కొంత ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. డబుల్ రోల్ పై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు కానీ, సినిమా యూనిట్ నుంచి లీక్ అవుతున్న అప్డేట్లు ఈ గాసిప్‌కి బలాన్నిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ మాస్, క్లాస్ లుక్‌లతో, డబుల్ డోస్ యాక్షన్, ఎమోషన్ మిక్స్‌తో ఓజీ ఒక పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందన్న టాక్ గట్టిగా వినిపిస్తుంది.
ఫ్యాన్స్ తో పాటు ట్రేడ్ వర్గాలు కూడా ఈ సినిమాపై భారీ హోప్స్ పెట్టుకున్నాయి. హరిహర వీరమల్లు చిత్రంతో పవన్ అభిమానులు కాస్త నిరాశ చెందగా, ఇప్పుడు ఓజీతో మాత్రం వారికి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని తెలుస్తుంది. ఇక ఈ సినిమా తర్వాత పవన్ నుండి ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం రానుంది. ఈ మూవీపై కూడా అంచనాలు భారీగానే ఉన్నాయి.

## 'ది బెంగాల్ ఫైల్స్' విడుదల వివాదం..

# న్యాయపరమైన చర్యలకు దిగిన దర్శకుడు




'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి వివాదాస్పద చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం ది బెంగాల్ ఫైల్స్. ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఇండిపెండెన్స్ డే ముందు బెంగాల్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా వచ్చింది. అయితే ఈ సినిమా విడుదలను బెంగాల్ ప్రభుత్వం అడ్డుకుంటుందని దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ఆరోపించాడు. ఈ సందర్భంగా దీనిపై న్యాయపరమైన చర్యలకు తీసుకోబోతున్నట్లు వెల్లడించాడు. మా సినిమా విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోంది. దీనిపై మేం రిట్ పిటిషన్ వేయాలని నిర్ణయించుకున్నాం.
కొందరు ప్రభుత్వ ప్రతినిధులు థియేటర్ల యజమానులను బెదిరిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఈ సినిమాను విడుదల చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని పోలీసులు హెచ్చరించినట్లు మాకు కొందరు చెప్పారు. సినిమాను విడుదల చేస్తే థియేటర్‌ను ధ్వంసం చేస్తే ఏం చేయాలి?' అని థియేటర్ల యజమానులు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. కొందరు వ్యక్తులు వాళ్లను అంతగా బెదిరించడం వల్లనే వాళ్ళు భయపడుతున్నారు. అందుకే, మేం దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాం అంటూ వివేక్ తెలిపాడు.

# సినిమా..

# ఎన్టీఆర్ పెన్సిల్ స్కెచ్‌కి భారీ ధర..

## 1.45 లక్షలు చెల్లించి అమెరికా అభిమాని కొనుగోలు!





టాలీవుడ్ టాప్ హీరోల్లో ఒకరైన ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్‌లో "వార్ 2తో సందడి చేశారు. ఈ చిత్రం భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు రాగా, అభిమానులని కొంత నిరాశపరిచింది. ఇక ఇప్పుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ అనే సినిమా చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా చేస్తుననాయి. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఎన్టీఆర్ పేరు మరోసారి వైరల్ అవుతోంది. అయితే ఈసారి కారణం సినిమా కాదు.. ఒక అద్భుతమైన స్కెచ్ ఆర్ట్! తెలుగు అమ్మాయి బ్యులా రూబీ పెన్సిల్ ఆర్ట్ లతో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు పొందుతోంది. సినిమా సెలబ్రిటీలు, స్టార్ హీరోల చిత్రాలను స్కెచ్ రూపంలో తీర్చిదిద్ది వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అమ్మకానికి ఉంచుతుంది. తాజాగా ఆమె గీసిన ఎన్టీఆర్ పెన్సిల్ స్కెచ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ స్కెచ్‌ను చూసిన ఓ ఎన్టీఆర్ అభిమాని అమెరికా నుంచి బ్యులా రూబీకి మెసేజ్ చేసి, తాను ఆ ఆర్ట్‌ను కొనాలనుకుంటున్నానని తెలిపాడు. ఈ విషయాన్ని ఆమె తన సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. బ్యులా రూబీ తెలిపిన వివరాల ప్రకారం, "ఇది నేను గీసిన తెలుగు హీరోల పెన్సిల్ స్కెచ్‌లలో అత్యధిక ధరకు అమ్ముడైనది. ఒక ఎన్టీఆర్ ఫ్యాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో నన్ను సంప్రదించి, దీన్ని 1650 డాలర్లకు అంటే సుమారుగా రూ. 1.45 లక్షలకు కొనుగోలు చేశాడు. ఇది నేను ఊహించలేదు. నా ఆర్ట్ ఇంత విలువ పొందుతుందని నాకు తెలియదు అని చెప్పారు. ఈ స్కెచ్ సోషల్ మీడియాలో వైరల్ కాగా, ఎన్టీఆర్ అభిమానులు బ్యులా రూబీ ఆర్ట్‌ను ప్రశంసిస్తున్నారు. "స్కెచ్ అదిరింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ స్కెచ్ ఆర్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఎన్నో రహస్యాలతో నియమాలను తిరగ రాయడానికి 'దక్ష' వస్తోంది..





టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చిత్ర శుక్ల 'దక్ష' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెడికల్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మంచు లక్ష్మీ ప్రసన్న, సిద్ధిఖీ, కలెక్షన్ కింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహిత మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డైమండ్ రత్నబాబు అందించిన కథతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విశ్వంత్, మహేష్, విరేన్, తంబి దొరై, సముద్రఖని, కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మంచు ఎంటర్టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ సంయుక్తం గా నిర్మిస్తున్నాయి. అచ్చు రాజమణి సంగీతం అందిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మూవీ మేకర్స్ హీరోయిన్ చిత్ర శుక్ల పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె 'మిథిలా' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "మిథిలా ముఖం అమాయకంగా కనిపిస్తుంది. కానీ మీరు తెలుసు అనుకున్న.. ప్రతి దాన్ని బద్దలు కొట్టే రహస్యాలతో ఆమె పాత్ర ఉండబోతుంది. ప్రపంచంలో సున్నితమైన స్వరంతో ఉంటుంది. కానీ ఆమె సైలెన్స్‌ను బలహీనతగా పొరపాటు పడకండి. నియమాలను తిరగరాయడానికి 'దక్ష' మీ ముందుకు వస్తోంది" అనే క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రేక్షకుల్లో హైప్ పెంచుతోంది.

# నా ప్రయాణం ముగిసింది.. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానంటూ ఉపాసన భావోద్వేగ పోస్ట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. అలాగే ఎంతోమందికి అపోలో హాస్పిటల్ ద్వారా సాయం అందిస్తూ ప్రశంసలు పొందుతోంది. ఇక ఇటీవల గురు పౌర్ణమి నాడు ఉపాసన తొమ్మిది వారాల పాటు సాయిబాబా వ్రతాన్ని చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. క్లిన్ కారా నర్స్ లతా సిస్టర్‌తో కలిసి ప్రారంభించినట్లు వెల్లడించింది. తాజాగా, ఈ వ్రతాన్ని పూర్తైనట్లు ఉపాసన తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ వీడియోను షేర్ చేసింది."గురు పౌర్ణమి నాడు నేను ప్రారంభించిన నా సాయిబాబా వ్రతం 9 వారాల పాటు కొనసాగింది. శాంతి, స్వస్థత, విశ్వాసంతో నా ప్రయాణం ముగిసింది. నేను ఈ వ్రతాన్ని కారా నర్సు లతా సిస్టర్‌తో కలిసి ప్రారంభించాను.
నేను అడిగిన దానికంటే దేవుడు ఎక్కువ ఆశీర్వదించినందుకు బాబాకు ఎల్లప్పు డూ రుణపడి ఉంటా. మీ కృపతో నా జీవితంలో ఎక్కువ మందికి సేవ చేయాలని నేను ప్రార్థిస్తున్నాను.
అత్తమ్మాస్ కిచెన్ తరపున ఈ రోజు భోజనం వడ్డిస్తున్నాము.. జై సాయిరామ్" అనే క్యాప్షన్ జత చేసింది. ఇక అది చూసిన నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తూ ఉపాసన ఎంత బిజీ ఉన్నప్పటికీ ఇలా చేయడం గ్రేట్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215